క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శుల సంబరాలు



పంచాయతీ కార్యదర్శులకు కేక్ తినిపిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ కాలం పూర్తి చేసుకున్నందుకు గాను మంగళవారం చిన్నకోడూరులో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేయాలని, వివిధ సమస్యల పరిష్కారానికి జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్య రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి



శిల్పకారులకు పనులను అప్పగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో నిర్మిస్తున్న మహాలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన పూర్వీకులు, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు విరాళాలు అందించడంతో ఇప్పటివరకు రూ.30లక్షల వరకు వచ్చాయని సర్పంచ్ తోడేటి రమేశ్ తెలిపారు. మంగళవారం ఆలయంలో విగ్రహాల ఏర్పాటుకు వరంగల్‌కు చెందిన శిల్పకారులకు రూ.14లక్షలకు పనులు అప్పగించినట్లు చెప్పారు. భక్తులు ఆలయ నిర్మాణానికి విరాళాలు అందించి సహకారం అందించాలని కోరారు.

మురికి కాల్వల నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలో చేపట్టిన మురికి కాల్వల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని 16వ వార్డులో చేపడుతున్న మురికి కాల్వల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ స్వచ్ఛతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులున్నారు.

ముస్లింలకు నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులను పంపిణీ చేస్తున్న నాయకులు

ములుగు(గజ్వేల్): రంజాన్‌ను పురస్కరించుకొని ఏ.జెడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి మహ్మద్ జుబేర్‌పాషా మండలంలోని తున్కిబొల్లారం, నర్సాపూర్, చిన్నతిమ్మాపూర్, సింగాయిపల్లి గ్రామాల్లోని 40 కుటుంబాలకు రూ.80వేలతో మంగళవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి, వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ హంస మహేశ్‌యాదవ్, ఉపసర్పంచ్ మల్లమ్మశ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఆసీఫ్, నజీర్, జహంగీర్, సందీప్ పాల్గొన్నారు.

బీరప్ప కల్యాణంలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో జరుగుతున్న బీరప్ప కల్యాణ మహోత్సవాల్లో మంగళవారం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కురుమ సంఘం సభ్యులను ఎంపీ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎర్మని దుబ్బరాజం, ఉపసర్పంచ్ వడ్ల ప్రభాకర్, మండల అధ్యక్షుడు రవి, బీఆర్‌ఎస్‌వీ నాయకులు పాల్గొన్నారు.

అన్ని మతాలకు ప్రాధాన్యం

మిరుదొడ్డి(దుబ్బాక): సీఎం కేసీఆర్ పాలనలో అన్ని మాతాలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు కో–ఆప్షన్ మెంబర్ ఎండీ.అహ్మద్ అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ముస్లింలకు తోఫాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు జహంగీర్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

కుంట శిఖం.. అన్యాక్రాంతం

- ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం
- సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని వేడుకోలు



గంగాపూర్‌లో కబ్జాకు గురైన బాలసాగర్ కుంట(దయ్యాల కుంట)

మర్కూక్(గజ్వేల్): విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కులకు ఫలహారంగా మారిపోతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ భూములు కబ్జా చేసి వాటిని కొంతమంది దున్నుకుంటున్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను కొన్ని సంవత్సరాలుగా కబ్జాచేసి తమ పట్టా భూమిగా మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రభుత్వ భూమి కనుమరుగవుతోంది. ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం మర్కూక్ తహసీల్దార్ కార్యాలయంలో అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డి కొండపోచమ్మసాగర్ కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. అదే సమయంలో గంగాపూర్ గ్రామస్తులు ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందించి వెంటనే ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ కబ్జాకు గురయ్యాయో పరిశీలించాలని సంబంధిత తహసీల్దార్‌కు సూచించారు. ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు గంగాపూర్‌లో ప్రభుత్వ భూముల్లో సర్వే నిర్వహించలేదని గ్రామస్తులు చెబుతున్నారు. బాలసాగర్ కుంట(దయ్యాల కుంట) 539 సర్వే నంబర్‌లో 12ఎకరాల 29 గుంటల భూమి ఉంది. అందులో సుమారు 6 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. అదేవిధంగా ఎర్రకుంట 578 సర్వే నంబర్‌లో 6 ఎకరాల 30 గుంటల్లో 3 ఎకరాల వరకు కబ్జాకు గురైందని గ్రామస్తులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడంతోనే ప్రభుత్వ భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నాయని వాటిని పరిరక్షించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతున్నారు.

కంచె ఏర్పాటు చేయాలి



బాలసాగర్, ఎర్రకుంట కొంతమంది చేతిలో కబ్జాకు గురైంది. పదుల సంఖ్యలో భూమి కబ్జాలో ఉంది. ఎవరికీ చెప్పినా పట్టించుకోవడం లేదు. గతంలో ఉమ్మడి ములుగు మండలంలో ఉన్నప్పుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే వచ్చి తూతూమంత్రంగా సర్వేచేసి వెళ్లిపోయారు. కనీసం సర్వేచేసిన తర్వాత హద్దులు ఏర్పాటు చేయకుండానే వెళ్లిపోయారు. వెంటనే అధికారులు స్పందించి సర్వే చేపట్టి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి.

– రాంచంద్రం, వార్డుసభ్యుడు, గంగాపూర్

ఆక్రమిస్తే చర్యలు



గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో కుంట, చెరువుల శిఖం కబ్జాలకు పాల్పడితే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలి. భూములను పరిరక్షించడానికి కృషి చేస్తా.

– భాగ్యరేఖ, తహసీల్దార్, మర్కూక్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



హుస్నాబాద్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని మార్కెట్ యార్డులో అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతుల కోసం రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబొయిన రజని, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని రజిత, ఎంపీపీ లకావత్ మానస, జెడ్పీటీసీ భూక్య మంగ, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి పేదింటి ఆడపిల్లలకు వరం

అక్కన్నపేట(హుస్నాబాద్): కల్యాణలక్ష్మి పేదింటి ఆడపిల్లలకు వరంలా మారిందని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా 71 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద రూ.71లక్షల 8వేల 236 విలువ గల చెక్కులను అందజేశారు. అదేవిధంగా 30 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.8లక్షల 90వేల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాంబరాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

మండలంలోని రేగొండ, మల్లంపల్లి గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ను ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగల ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రమేశ్, రాజేశం, రవీందర్, తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్‌బాబు, నాయకులు ఉన్నారు.

‘ప్రజాదరణ చూసి ఓర్వలేకే విమర్శలు’



మాట్లాడుతున్న రవీందర్

గజ్వేల్: రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్న మంత్రి హరీశ్‌రావును కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క భజన శాఖ తీసుకోవాలంటూ విమర్శలు చేయడం సహించరానిదని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్ హెచ్చరించారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భట్టి తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సొంత పార్టీని చక్కదిద్దుకోలేని కాంగ్రెస్ నేతలు హరీశ్‌రావును టార్గెట్ చేస్తూ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ అడుగుజాడల్లో హరీశ్‌రావు ప్రతినిత్యం 18గంటలకుపైగా ప్రజా సేవలో నిమగ్నమవుతున్నారని చెప్పారు. మంత్రి హరీశ్‌రావు ప్రజల్లో విశేష ఆదరణ చూరగొనడాన్ని కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ నేడు దేశానికే దిక్సూచిగా మారడం కాంగ్రెస్, బీజేపీ నేతలకు మింగుడుపడటం లేదన్నారు. ప్రధాని వస్తే సీఎం కేసీఆర్ స్వాగతం పలకలేదని గగ్గోలు పెడుతున్న బీజేపీ నేతలు మోదీ పర్యటనలో రాష్ట్రానికి ఏం సాధించారో ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాల తీరు మారకుంటే ప్రజల్లో చులకనవడం ఖాయమన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు బచ్చలి మహిపాల్, తాడేం దశరథం, కంకణాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి



మాట్లాడుతున్న డీపీఎం కరుణాకర్

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని మార్కెటింగ్ డీపీఎం కరుణాకర్ సిబ్బందికి సూచించారు. బెజ్జంకిలో మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై కొనుగోలు కమిటీ సభ్యులకు అవగాహన సమావేశం నిర్వహించారు. వరి కోతలు ప్రారంభమైనందున ముందస్తుగా కొనుగోళ్లు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈఫసల్ నుంచి గ్రేడ్ ఏ రకం వరికి క్వింటాల్‌కు 2060 రూపాయలు, బీ గ్రేడ్ ధాన్యానికి 2040 రూపాయలు చెల్లించనున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం నర్సయ్య, ఏఓ సంతోష్, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఎంపీఓ విష్ణు, సీసీలు, వీఓలు, కొనుగోలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి



పెట్రోల్ బంక్‌లో సేఫ్టీ పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

హుస్నాబాద్: పెట్రోల్ బంక్‌లు, జిన్నింగ్ మిల్లుల్లో ఏదైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, వాటితోనే మంటలు ఆర్పివేయొచ్చని హుస్నాబాద్ ఫైర్ అవుట్ పోస్ట్ ఇన్‌చార్జ్ నరేశ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం పెట్రోల్ బంక్‌లు, జిన్నింగ్ మిల్లుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. ఫైర్ సేఫ్టీ పరికరాలను అత్యవసర పరిస్థితుల్లో వాడుటకు వీలుగా నిత్యం పరిశీలన చేసుకుంటూ జాగ్రత్త పడాల్సి ఉంటుందని తెలిపారు. అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలను అరికడుతూ జాతి సంపదను పెంపొందించుకోవాలన్నారు.

అజాగ్రత్తతోనే అగ్ని ప్రమాదాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్‌లో సిబ్బంది, డెలివరీ బాయ్స్‌కు సిలిండర్ నిల్వ చేసే సమయంలో, రవాణా చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్ర అధికారి సుల్తాన్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. సిలిండర్ నిల్వ చేసే సమయంలో కింద, పైభాగాల్లో వెలుతురు, గాలి ఉండేట్లు చూసుకోవాలన్నారు. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే దానిని నివారించడానికి కావాల్సిన సామగ్రి నీరు, ఇతర అగ్నిమాపక సాధనాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సిలిండర్ లీక్ అవుతున్నట్లు గుర్తిస్తే వెంటనే దానిని బహిరంగ ప్రదేశానికి తరలించాలని సూచించారు. అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే 101కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఫైర్‌మాన్ నరేశ్, సిబ్బంది, గ్యాస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ సప్తదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రధానార్చకుడు శేషం శ్రీనివాసాచార్యుల వైదిక నిర్వహణలో ఆలయంలో సుప్రభాతసేవ, మహాపూర్ణాహుతి, కుంభ ఉద్వాసన, చక్రస్నానం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు బుక్క రమేశ్, భక్తులు పాల్గొన్నారు.



మూలమూర్తులకు చక్రస్నానం నిర్వహిస్తున్న వేద పండితులు

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. మంగళవారం పట్టణంలోని 20వ వార్డులో రూ.20లక్షల వ్యయంతో చేపట్టే సీసీరోడ్ల పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ.. పట్టణంలో ఇప్పటికే దాదాపు రూ.30కోట్ల విలువ చేసే సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నామని తెలిపారు. దశల వారీగా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని, వేసవి కాలంలో తాగునీటి సమస్యలు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్ సుప్రజ, మాజీ ఎంపీపీ వెంకట్, కో–ఆప్షన్ సభ్యులు శంకర్‌రెడ్డి, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి పాత్రలు దుకాణాల్లో విక్రయించొద్దు



దుకాణాదారులకు వినతిపత్రం అందిస్తున్న కుమ్మర సంఘం జిల్లా నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మట్టి పాత్రలను దుకాణాల్లో విక్రయించొద్దని కుమ్మర సంఘం నాయకులు దుకాణాదారులకు విన్నవించారు. మంగళవారం కుమ్మర సంఘం జిల్లా నాయకులు జిల్లా కేంద్రంలోని పలు దుకాణాదారులు మట్టి పాత్రలు విక్రయించడం సరికాదని, దీంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని అవగాహన కల్పించారు. వివాహాలకు, పండగలకు, పూజలకు వినియోగించే మట్టి పాత్రలు దుకాణాల్లో విక్రయించడం ద్వారా, వినియోగదారులు తమ వద్ద మట్టి పాత్రలు కొనుగోలు చేయడం లేదని వాపోయారు. కుమ్మర్లకు ప్రతి దుకాణాదారుడు సహకరించి, తమ దుకాణాల్లో మట్టి పాత్రల విక్రయాన్ని నిలిపివేయాలన్నారు. వినియోగదారులు తమ ఇంట్లో వినియోగించే మట్టి పాత్రలను కుమ్మర్ల నుంచే కొనుగోలు చేసి ఆర్థికంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కుమ్మర సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



మిరుదొడ్డి(దుబ్బాక): సీపీఆర్‌పై పోలీసులకు అవగాహన కల్పిస్తున్న అమీనా సుల్తానా



దుబ్బాక: సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మహరాజ్

దుబ్బాక: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాయపోల్ ప్రాథమిక కేంద్రం డాక్టర్ మహరాజ్, ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండల కేంద్రంలోని రైతువేదికలో రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆకస్మాత్తుగా గుండె పోటుకు గురైనా వారికి సీపీఆర్ చేయడం ద్వారా వారిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడుకోవచ్చన్నారు. గుండెపోటుకు వయస్సుతో సంబంధం లేదని అది సమయంలోనైనా రావచ్చన్నారు. వచ్చిన వెంటనే సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, ఎంపీడీఓ మున్నయ్య, తహసీల్దార్ సహదేవ్, ఆర్ఐ భానుప్రకాశ్ తదితరులున్నారు.

మానవత్వం చాటినప్పుడే సమాజంలో గుర్తింపు

మిరుదొడ్డి(దుబ్బాక): ఆపదలో ఉన్న వారిపై మానవత్వం చాటినప్పుడే సమాజంలో మంచి మార్పు వస్తుందని ఎంపీపీ గజ్జెల సాయిలు అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని రైతువేదిక భవన్‌లో వివిధ శాఖల అధికారులకు సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసస్సిటేషన్)పై పీహెచ్‌సీ డాక్టర్ అమీనా సుల్తానా, హెల్త్ రిసోర్స్ పర్సన్ నాగరాజు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ జహూరుద్దీన్, ఎంపీడీఓ నారాయణ, ఏఎస్ఐ మధు, పోలీస్ సిబ్బంది బాబు, వినోద్‌కుమార్, పీహెచ్‌సీ సీహెచ్ఓ లింగమూర్తి, వైద్య సిబ్బంది రవి, సుధీర్, సుజాత, మిరుదొడ్డి, అక్బర్‌పేట–భూంపల్లి మండలాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): సీపీఆర్ చికిత్సపై అందరికీ అవగాహన అవసరమని తహసీల్దార్ రామేశ్వర్ రావు అన్నారు. మండల కేంద్రమైన కొండపాకలోని ఎంపీడీఓ కార్యాలయంలో సీపీఆర్ చికిత్స విధానంపై ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురీరెడ్డి, ఎంపీడీఓ రాంరెడ్డిలతో కలిసి మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ప్రజలు చాలా వరకు ఒత్తిడిలకు లోనై గుండెపోటుకు గురవుతున్నారన్నారు. గుండెపోటు గురైన వారికి సీపీఆర్ చికిత్సను అందించడంతో ప్రాణనష్టం జరగకుండా చూడవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మంచాల అనసూయ, ఆరుట్ల లక్ష్మి, ఉపసర్పంచ్ ఆరె భాస్కర్, ఎంపీఓ వీరరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): గుండెపోటుకు గురైనట్లు అనుమానం వస్తే వెంటనే సీపీఆర్ చేస్తే ప్రాణాలను కాపాడొచ్చని వైద్యాధికారి నిమ్రా అన్నారు. మంగళవారం నంగునూరులో రాజగోపాల్‌పేట, గట్లమల్యాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూ, వైద్య సిబ్బందికి సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌గౌడ్, వైద్యులు అంజలి, ప్రవీణ్‌నాయక్, ఎంపీటీసీ సునిత, తిరుపతి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి వినోద్‌రెడ్డి అన్నారు. మంగళవారం అక్కన్నపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, ఎంపీఓ కవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీపీఐ ప్రజాచైతన్య యాత్రను విజయవంతం చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): పల్లె పల్లెకూ సీపీఐ పేరుతో చేపడుతున్న ప్రజాచైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. బెజ్జంకిలో మంగళవారం ప్రజాచైతన్య యాత్ర పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ నెల 21వ తేదీన బెజ్జంకి మండల కేంద్రంలో నిర్వహించే ఈయాత్రకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ, అనుబంధ విభాగాల నాయకులు ధర్మారెడ్డి, మహేశ్, పరశురాములు, రాకేశ్, నరేశ్, చరణ్, బాలమల్లు, రాములు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు మంచి స్పందన లభించింది. మొత్తం సుమారు 300ల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావులు మాట్లాడారు. ముతూట్ ఫైనాన్స్, శ్రీరామ్ లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ తదితర నాలుగు కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారన్నారు. ఇందులో నుంచి 90 మందిని షార్ట్‌లిస్ట్ చేసినట్లు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు త్వరలో సమాచారం అందించనున్నట్లు వివరించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

హుస్నాబాద్: పట్టణంలోని 14, 16వ బూత్‌లో బీజేపీ బూత్ సశక్తికరణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ తెలిసేలా వివరించాలన్నారు. ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ శ్రావణ్‌కుమార్, స్వల్పకాలిక విస్తారక్ శ్రీనివాస్, నాయకులు లక్ష్మణ్, అరుణ్‌కుమార్, కోమటి సత్యనారాయణ, సత్యం తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం



సిద్దిపేటకమాన్: సిద్దిపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ప్రభాకర్ కుటుంబసభ్యులకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి తమ సిబ్బంది సహకారంతో మంగళవారం రూ.77వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ కిరణ్, ఎస్ఐ వెన్నెల, హెడ్ కానిస్టేబుళ్లు చెన్నగౌడ్, అంజయ్య, రవీందర్, కానిస్టేబుళ్లు రవి, శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా ఇఫ్తార్

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని సేయింట్ జోసెఫ్ పాఠశాలలో మంగళవారం రాత్రి ఆ పాఠశాల కరెస్పాండెంట్ బ్రిగ్జిట్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి మాట్లాడుతూ.. అన్ని మతాలు సమానమేనని తెలియజేస్తూ రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్ అల్వాల బాలేశ్, నాయకులు హరిశ్చంద్రప్రసాద్, కరీమొద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దుబ్బాకరూరల్: మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన అఖిలకు మంజూరైన రూ.51వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ యాప్‌పై శిక్షణ

సిద్దిపేటకమాన్: సెల్‌ఫోన్ పోయిందని వచ్చే ఫిర్యాదులను సీఈఐఆర్ యాప్‌లో నమోదు చేయాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో సిబ్బందికి (సీఈఐఆర్) సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టార్ యాప్‌పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం రెండో రోజు మంగళవారం కొనసాగింది. ఈ శిక్షణను సందర్శించిన అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ మాట్లాడుతూ.. పోగొట్టుకున్న సెల్‌ఫోన్ పూర్తి వివరాలు ఈ యాప్‌లో నమోదు చేసి సెల్‌ఫోన్‌ను బ్లాక్ చేయడం ద్వారా అది పనిచేయకుండా చేయొచ్చన్నారు. సెల్‌ఫోన్ దొరికిన తర్వాత ఆన్‌లైన్‌లో ఈ యాప్‌లో అన్‌బ్లాక్ చేయడంతో తిరిగి సెల్‌ఫోన్ పని చేస్తుందని తెలిపారు.